
# ఆవిడగారి అవధానం

డా॥ మంతెన సూర్యనారాయణరాజు



"ఏం కోరి జుట్టు తీయించుకున్నావే! హవ్వ! హవ్వ! చూసేవాళ్ళు ఏమనుకుంటారనే ఇంగిత జ్ఞానం కూడా నీకులేకుండా పోయిందే! పెళ్ళి కాకనా... అంటే బంగారంలాంటి భర్త. పోనీ పిల్లల కోసమా అంటే రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు. సంపాదన లేదాంటే రెండు చేతులా సంపాదించే మంచి ఉద్యోగం చేస్తున్న వ్యక్తి నీ మగడాయె!

నాగుబాము లాంటి 'నల్లని, పిరుదులు తాకుతూ అందంగా ఉండే వాల్జెడ తిరపతి కెళ్ళి కట్ చేయించుకునొస్తావా! ఎవరిచ్చేరే... నీకీ దిక్కుమాలిన సలహా!" అంటూ జుట్టు దండకం చదివింది వినాయకరావు తల్లి మహలక్ష్మి.

"అయ్యో! స్వామికి తలనీలాలిస్తే అలా అనొచ్చునా! అపచారం! అపచారం! లెంపలేసు

కోండి అత్తయ్యా!" అని తాను రెండు లెంపలూ వాయించుకుంది మోహనాంగి.

అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన వినాయక రావు తల్లి మహాలక్ష్మి అందించిన మంచి తీర్థం తాగాడు. ఎదురుగా కనిపించిన భార్యను చూసి విస్తుపోయాడు. నవ్వుతూ ఫైల్స్ రాక్‌లో పెట్టి "ఏవిటే ఈ వెస్ట్రన్ హెయిల్ స్టైల్! పరమ చెత్తగా ఉంది. నాకు ప్రమోషన్ రావాలని మొక్కు తీర్చుకొని వచ్చుంటావు. మొన్నీ మధ్యనేగా నాకు ప్రమోషన్ వచ్చింది. సంవత్సరానికి రెండు సార్లు ప్రమోషన్లు ఇచ్చే సంస్థకాదు మాది" బూటులేసులు విప్పుకుంటూ అన్నాడు. మోహన భర్త దగ్గరకొస్తూ "ముందీ ప్రసాదం మీరూ! అత్తయ్యా తినండి. నేనెందుకెళ్ళానో, ఈ మొక్కెందుకిచ్చానో చెబితే మీరు ఎగిరి గంతులేస్తారు". "నాకిప్పుడు ఎగిరేంత ఓపిక లేదులే!" అన్నాడు వినాయకం. "అబ్బా! జో[illegible]గా పండి. నన్ను అభినందిస్తారు కూడా విషయం తెలిస్తే!" అంది కళ్ళు ఆల్చిప్పల్లా అప్పళిస్తూ.

"అదేదో తొందరగా చెప్పు. సస్పెన్స్ పేరుతో మరీ ప్రొలాంగ్ చెయ్యక" అంటూ ముఖం చిట్లించాడు.

"అయినా మాట మాత్రమైనా తిరపతి వెళ్తున్నట్టు చెప్పాపెట్టకుండా పుట్టింటికెళ్ళి అట్నుంచి అటే అవలీలగా వెళ్ళేసొస్తావా! అసలు మగడనే వాడున్నాడనే లక్ష్యం లేదటే పిల్లా నీకు?" అంది కోడల్ని నిలదీస్తున్నట్లు మహాలక్ష్మి. "కూల్ డౌన్! కూల్ డౌన్! అత్తయ్యా! ఈ వయసులో ఉద్రేకం పనికిరాదు మీకు. బి.పి. పెరుగుతుంది గనుక. నేనెవర్ని?". "బాగుంది వరస. వెనకటికి చదవేస్తే ఉన్నమతి పోయిందని, నువ్వు సుబ్బావధాని అన్నగారి కూతురు మోహనాంగిని". "ఔను కదా! మరి మీరిప్పుడు చెప్పండి శ్రీవారూ! మా నాన్నగారేంచేస్తుంటే వారు? అదే... మేష్టర్ గిరీ కాకుండా..!"

"ఆ! అదే అడపాదడపా అవధానాల్లాంటివి చే[illegible]వారు" అంటూ ఆగాడు వినాయకం.

"[illegible]వా! అందుకని ఆ తండ్రి పేరు నిలబెట్టాలని నేను కూడా అవధానం చెయ్యాలనుకుంటున్నాను. అందుకనే శుభారంభం కోసం అడ్వాన్సుగా ఆ వెంకటరమణమూర్తికి తలనీలాలు మొక్కు సమర్పించుకుని వచ్చాను" అంది మోహన.

"హతోస్మి! చచ్చిరి సుతుల్, బంధువుల్..." అంటూ ఆపైన రాక ఆగిపోయాడు వినాయకం.

"ఏవిటేవిటి? మగరాయుడిలా పృచ్ఛకులు, కవి పండితుల మధ్య కూర్చుని అష్టావధానం చెయ్యడమంటే మాటలా! నీకు ఇంట్లో వంటా వార్పే సరిగారాదు" అంది చోద్యంగా మోహనాంగిని చూస్తూ ఆమె అత్తగారు మహాలక్ష్మి.

"అత్తయ్యా! ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం. మీరు స్త్రీ అయ్యుండి నన్ను ప్రోత్సహించవలసిందిపోయి, నిరుత్సాహపరుస్తున్నారంటే యావత్ స్త్రీజాతికే అవమానం. అవమానం. అహో! నేనిటువంటి సహాయ నిరాకరణోద్యమాన్ని భరించలేను. లేను" అంటూ ఊగిపోయింది మోహన.

మహాలక్ష్మికి తన కోడలు మోహనాంగికి కొత్తగా ఈ అవధానాల పిచ్చి పట్టుకున్నందుకు చిర్రెత్తుకొచ్చింది. "అబ్బాయ్! వినాయకా! నేనింక మనూరెళ్ళిపోతానురా!" అంది. వినాయకరావు నవ్వేస్తూ, "అదేవిటే అమ్మా! నువ్వుండబట్టే వేళకింత తిండీ—తిప్పలూ నాకూ, నీ మనవలకీ అమరుతున్నాయి. నువ్వెళ్ళిపోతే నాకేం తోచదు. రాత్రి పది గంటలదాకా నన్నా పిల్లల్ని టి.వి. చూడనివ్వకుండా నువ్వు చక్కగా చదివిస్తున్నావు. ఇదేమో కవిత్వం అనీ, కథలనీ కాకరకాయలనీ కాలయాపన చేస్తూ ఉంటుంది. ఇప్పుడు అవధానాలంటూ పెద్ద ప్రయత్నమే మొదలెట్టింది" అన్నాడు అగమ్యగోచరంగా భావిని గురించి ఆలోచిస్తూ.

"షేమ్! షేమ్! ఆడదాన్ని గౌరవించలేని, ఆమె అభివృద్ధికి ఓర్వలేని సొసైటీ అసలు సొసైటీయే కాదు. యత్రనార్యస్తు పూజ్యంతే..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది.

"ఇంక ఆపు మోహనా! నువ్వు తెలుగులో వచన కవితలు, అడపాదడపా... అప్పుడప్పుడు నాలుగు పద్యాలూ గీకినంత తేలిక కాదు అవధానం చెయ్యడమంటే! ఇంతకీ నువ్వు చెయ్యదలుచుకున్నది అష్టావధానమా! శతావధానమా!! ఏకంగా సహస్రావధానమా!!!" అంటూ ఆగాడు వినాయకం.

"భలే వారే మీరు. అష్టావధానమే! ముందు మన ఇంట్లో ఈ సంవత్సరాది శుభదినాన శాంపిల్‌గా మొదలుపెట్టదల్చుకున్నాను. మీరు సమస్య, పక్కింటి సుబ్బారాయుడు మాష్టారు దత్తపది, అత్తయ్యగారు పురాణశ్రవణం, ఎదురింటి పున్నారావుగారు అప్రస్తుత ప్రసంగం, మా ఆదర్శ మహిళా మండలి ప్రెసిడెంట్ అమ్మాయమ్మ వర్ణన, పిల్లలకి ట్యూషన్ చెప్పే భల్లూక శాస్త్రిగారు నిషిద్ధాక్షరి —ఇంకా ఇలాగే థలోటీ పురమా ఇస్తా!" అంది.


"అలాగా! కోడలు పిల్ల తెలివైందే! నేను పద్యం బాగా చదువుతానని నన్ను సెలక్టు చేశావు. ఇంట్లో కాబట్టి సరిపెట్టుకుంటాను నేను. బైటికి రమ్మంటే మాత్రం ఛస్తే రాను. ముందే చెబుతున్నా!" అనేసింది మహాలక్ష్మి లోనికి వెళ్ళిపోతూ.

"మొత్తానికి అత్తగారి పర్మిషన్ అవలీలగా కొట్టేసావోయ్! అయినా... నీకు ఎవర్ని ఎక్కడ కొట్టాలో, అదే పట్టాలో బాగా తెలుసు. అయితే ఇటుపై మోహనావధాని అని పిలిపించుకోదల్చుకున్నావన్న మాట. ఈ వ్యాపకంలో పడి సంసారాన్ని మర్చిపోకు" అన్నాడు వినాయకం.

"మరీ మోహన టేలెంట్ ఎటువంటిదో చూపిస్తా! సంసారాన్నెందుకు మర్చిపోతా!" అంది వీరవిప్లవ నారిలా పోజు పెడుతూ.

"నాకు తెలీకడుగుతా! పండిత పుత్రా పరమ శుంఠ అన్నారు కదే!" అంటూ ఆగాడు.

"చూడండి. మిష్టర్ వినాయకంగారూ! పండిత పుత్రుడి గురించే వారు చెప్పారు గాని... పుత్రిక గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు .



ఆపరేషన్ పూర్తయింది. "మీ రింక బరువు పన్లు చేయక్కర్లేదు. ఇంతకీ మీరేం చేస్తుంటారు ? అడిగాడు డాక్టర్ దయానందం.

"దోపిడీలు —హత్యలు" అన్నాడు గంగులు.

"ఆ... అయితే ఇక నుండీ జేబు దొంగతనాలు చేసుకోండి అన్నాడు" డాక్టర్.

—చందూవంశీ

కొత్తగా వచ్చిన టీచర్ తనను తాను పరిచయం చేసుకుంటూ 'మా తాత సింహం', 'మా నాన్న పులి', నన్నందరూ 'పులిబిడ్డ' అంటారు తెలుసా పిల్లలూ' అన్నాడు.

ఒక విద్యార్థి వెనుక నుంచి —"అయితే మీ వంశంలో మనుషులెవరూ లేరన్నమాట" అన్నాడు.

—చందూ వంశీ



మన పెద్దలు. కాబట్టి మీరింక ఇటువంటి చొప్పదండు ప్రశ్నలు వెయ్యకండి" అని లోనికి వెళ్ళిపోయింది.

రాత్రి పడక గదిలోకి ప్రవేశిస్తుంటే వినాయకానికి ఎప్పటిలాగా భార్య కొప్పులో మల్లెలు స్వాగత గీతాలు పలకలేదు. మాడుగుల నాగఫణిశర్మ సహస్రావధానం కాసెట్ వినిపించింది. ప్రక్క గదిలో పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. హాల్లో వినాయకం తల్లి మహాలక్ష్మి నిద్దట్లో కూడా పెదాలు కదుపుతూంది. టేప్ రికార్డర్ ఆపుజేశాడు వినాయకం.

"అదేవిటండీ! చక్కని కంఠంతో ఎంతో శ్రావ్యంగా శర్మ పద్యాలు ఎలా చెబుతున్నాడో! సరస్వతీ కటాక్షం ఉండబట్టే అతను 'అవధాన సరస్వతీ పీఠంలో అవధాన సరస్వతి' అయ్యాడు. చూశారా! సరస్వతీదేవి ఆడదయ్యిండీ స్త్రీలకి ఈ విద్యని అనుగ్రహించకుండా, మగవాళ్ళకే ఎక్కువగా ఈ సామర్థ్యాన్ని ప్రసాదించి, ఆడవాళ్ళకి తీరని అన్యాయం చేసిందండీ!" అంది మనసులోని బాధను వ్యక్తం చేస్తూ మోహనాంగి.

"బాగుందే! మగవాణ్ణి కూడా పుంభావ సరస్వతి అంటూ సమర్థిస్తూన్నారుగా! ఇప్పుడు మంచి కవిత్వం నువ్వు చెప్పడం ప్రారంభిస్తే... నేనే నిన్ను అవధాన ఆడసరస్వతి అనేస్తాను. అదే మన పనిమనిషిని ఆడపైడి తల్లి అన్నట్లు" అన్నాడు నవ్వేస్తూ.

"ఛ!ఛ! మీది మరీ నీచోపమ. దానితో నన్ను పోలుస్తున్నారా! మీ మగాళ్ళ బుద్ధే లేకి బుద్ధి" అంటూ బుంగమూతి పెట్టి పక్కకు తిరిగి పడుకుంది. వినాయకం లైటు తీశాడు.

"అవధానమ్మగారూ! గోంగూర, కొత్తిమీర, మెంతికూర, తోటకూర ఈ పదాలొచ్చేలా ఒక పద్యం చెప్పండి" అన్నాడు. దత్తపది అడిగే పృచ్ఛకుడు. వెనువెంటనే సభలో ఉన్న ఆడవాళ్ల మధ్యనుంచి 'కేకలు, ఒకటే అరుపులు మిన్నుముట్టాయి.

"అవధానమ్మ అనడం ఒక తప్పు. ఆడవారిని కించపరిచే విధంగా మీర్చిచన పదాలు ఉండటం రెండోతప్పు. మొహనా నువ్వు పద్యంచెప్పకు" అంటూ ఒకరిని మించి ఇంకొకరు రెచ్చిపోతూ మహిళా మండలి విరుచుపడింది.

దత్తపది ఇచ్చిన పృచ్ఛకుడికి దడపుట్టుకొచ్చింది. వారివైపుచూస్తుంటే అప్పడాలకర్రలు,చీపిరికట్టలు అందుబాటులోలేవుగాని, ఉంటేమటుకి అతనికి దేహశుద్ధి చేసేటంత వేడిలో ఉన్నారు. పైటకొంగులు బిగించిఆడియన్స్ లోంచి కొందరైతే డయాస్‌వైపు లేచివచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పాపం పృచ్ఛకుడు నాకు చిన్న పనుందని చెప్పిలేచి మెల్లిగా స్టేజీదిగి జారుకుంటున్నాడు. అదిచూసిన లేడీ ఆడియన్స్ వికటాట్టహాసం చేస్తూ "పిరికిపంద పిరికిపంద" అంటూ ఆట పట్టించారు. ఆ మాటలు వినిపించి ఆయనగారు ఊడిపోతున్న గోచీని నాన అవస్థలు పడుతూ సర్దుకుంటూ బిక్కచచ్చిపోతూ బైటికి పరుగుతీశాడు.

మోహనాంగి అత్తగారు మహాలక్ష్మి సమయస్ఫూర్తితో భాగవతంలోది ఒక పద్యం అందంగా చదివింది. ఎంతో తన్మయులై అంతా ఆనందంతో చప్పట్లు చరిచారు. మగశ్రోతల్లో ఒకడు 'వన్స్‌మోర్' అన్నాడు. వెంటనే లేడీస్ మధ్య నుంచి 'నోమోర్' అంటూ రెస్పాన్స్ వచ్చింది. ఈలోగా అప్రస్తుత ప్రసంగం ఆయన "అమ్మా! అవధాని సరస్వతి! నేను నాలుగిడ్లీలు, బకెట్ సాంబారు నీకిస్తే వాటి నేం జేస్తావు?" అంటూ ప్రశ్నించాడు. "ఎంతసేపూ మీ మగాళ్ళకు తిండిమీద ధ్యాసేనా! వేరో ధ్యాస ఉండదా!" అని ఊరుకున్నారు. మగాళ్ళు గలభా చెయ్యబోతే మళ్ళీ ఆడాళ్ళు కేకలు మొదలెట్టారు. మొహన జంకు లేకుండా "వాటిని సాంబార్లో పారేస్తా!" అంది. అంతా బ్రహ్మాండం బ్రద్ధలైనంత గట్టిగా కరతాళధ్వనులు చేస్తూ నవ్వారు. అడిగిన పెద్దమనిషి కిమ్మన్నాస్తి అన్నట్లు సైలెంటు గాఉండిపోయాడు. విజయగర్వంతో ఆడవాళ్ళంతా మరోసారి చప్పట్లు చరిచారు.

పట్టుమని పాతిక పద్యాలు చెప్పేసి ఎలుగైతే మోహనాంగి అవధానం పూర్తయ్యిందనిపించేసరికి నాలుగున్నర గంటలయ్యింది. జిల్లాల్లో ఎక్కడో పనుండి అటుగా వచ్చిన ఆడ కలెక్టర్ గారు విషయం తెలిసి సర్ప్రైజ్ విజిట్‌గా అక్కడికొచ్చింది. ఇంకేముంది కర్ణాకర్ణిగా ఆ వార్త అందరికీతెలిసిపోయింది. జనం ఆవిడని చూడ్డానికన్నట్లు విరగబడి లేచిపోయారు. తొక్కిసలాటలు ప్రారంభమయ్యింది. అవధానానికి తోడు జనం మళ్ళీ కలెక్టరుగారిని చూడ్డానికి ఎప్పుడైతే హైరానా పడ్డం మొదలెట్టారో పోలీసులు రంగప్రవేశం చేసి అదిలించి అందర్నీ కూర్చోబెట్టారు. లాఠీఛార్జి చెయ్యాల్సివచ్చేదే! చేస్తే మహిళలు మరింత రెచ్చిపోయి కలెక్టర్‌నే ఘెరావ్ చేస్తారని ఊహించి ఆ ప్రయత్నం నుండి విరమించుకున్నారు.

ఎవరో పెద్దాయన సూచనపై కలెక్టర్ గారైన తపన్ సిన్హాగారిని వేదికనలంకరించి ఈ అవధానిగారికి సన్మానసారథ్యం వహించవలసిందని కోరారు. ఆమె ఆనందంగా అందుకు అంగీకరించింది. దండవేసి, నెత్తిమీద పూల కీరీటం పెట్టి, శాలువా కప్పి కౌగిలించుకున్నంత హడావుడి చేసింది. వేద పండితుల మంత్రోఛ్చారణ కేసెట్ పెట్టారు. ఆ కార్యక్రమం ముగియగానే కలెక్టర్ గారి సందేశం అన్నారు. "ఆంధ్రదేశంలో అ[illegible]ధాన విద్యలో నేడు నారీమణులలో కూడా మగవారిని మించి పోతున్నారని మనం పేపర్లో చదువుతున్నాం! మోహనలాంటి వారు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ మన స్త్రీ జాతి పరువును, బరువును నిలబెడుతున్నందుకు నేను ఆమెను మనసారా అభినందిస్తున్నాను. ఆమె విదేశాల్లో కూడా ఈ విద్యను ప్రదర్శించి బాగా రాణించాలని కోరుతున్నాను" అంది ఇంగ్లీషులో. మోహనాంగి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోయింది. కలెక్టరమ్మకు బాగాదగ్గరగా నిలబడి ఫోజుపెట్టి ఫోటోలు తీయించుకుంది. ఇద్దరి హెయిర్ స్టైల్సూ ఒకేవిధంగా ఉన్నాయి. కలెక్టర్ వెంటనే అందరికీ కృతజ్ఞతలు చెప్పి పి.ఎ.తో బాటు కారెక్కి వెళ్ళిపోయింది. అనంతరం మోహనాంగిని ఆ ఊళ్ళో మహిళా సంఘాలన్నీ సన్మానించాయి. అనంతరం పౌర సన్మానం జరిగింది. నిజానికి పృచ్ఛకులే ఆమె అవధానంలో పాపం కష్టపడిందీ! నష్ట(పరువు) పోయిందీను. వారికి, సమన్వయకర్తకీ అవధాన నిర్వాహకులు ఒక్కో చిన్న కమలాఫలం, ఒకనూలు జేబురుమాలు అర్ధనుట పదహార్లూ ఇచ్చి సత్కరించారు. ఆ పె[illegible]మందుగురికీ, సమన్వయకర్తకీ బాగుండదని ఎవరోచెబితే సభా నిర్వాహకుడు తొమ్మిది నూరు నెంబరు కండువాలు తెప్పించికప్పాడు. జనగణమణ గీతంతో మోహన అవధానం కడుసమ్మోహనంగా నారీమణులంతా ఏకతాటిమీద నిలబడి సునాయాసంగా నడిపించారు. అది ఒక ఘనవిజయంగా మోహనను ఆకాశానికి ఎత్తేసింది నారీలోకం. తెల్లవారగానే అన్ని పత్రికల్లో ఆ వార్త. కలెక్టర్ గారితో అవధానమ్మ తీయించుకున్న ఫోటో జిల్లా అనుబంధాల్లో దర్శనమిచ్చాయి. సెంటిమెంటుతో తిరపతిలో తీయించుకున్న జుట్టు మోహనాంగిని ఓ మెట్టు పైకెళ్ళేలా ప్రమోట్ చేయించింది.

★



"ఏవండీ వంటింట్లో చప్పుడవుతోంది. దొంగ వెధవలా వున్నాడు. పండక్కోసం చేసిన పిండివంటలు తినేస్తాడేమో వెధవ లేచి చూడండి" అని భర్తని లేపింది.

"అబ్బా ! తింటే తిన్నాడు —పొద్దున్నే హాస్పిటల్‌లో జాయిన్ చేయిస్తాలే —నువ్వు పడుకో" అని మళ్ళీ ముసుగుతన్నాడు శ్రీను.

—చందూవంశీ